తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | మంగళవారం-17-ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:260 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



# తెలంగాణ జాగృతిలో చింతల రాజలింగం చేరిక


- ఎస్సీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడి నిర్ణయం
- పలు కుల సంఘాల నేతల సమక్షంలో కార్యక్రమం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎస్సీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ కార్యక్రమం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో జరిగింది. చింతల రాజలింగం గారితో పాటు జిహెచ్ఎంసి పరిధిలోని పలు కుల సంఘాలకు చెందిన నాయకులు కూడా తెలంగాణ జాగృతిలో సభ్యత్వం స్వీకరించారు. సమాజ హక్కులు, సామాజిక న్యాయం కోసం కలిసి పనిచేయాలని వారు తెలిపారు.

తెలంగాణ జాగృతి వేదికగా బలహీన వర్గాల సాధికారత కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు అభిప్రాయపడ్డారు. సమాజ అభివృద్ధి లక్ష్యంగా కార్యాచరణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చేరిక కార్యక్రమం సాదరంగా నిర్వహించబడింది. నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని ఐక్యతతో ముందుకు సాగాలని సంకల్పించారు.

# కొలువుదీరిన పురపాలక పాలకులు




## నూతన మేయర్, చైర్మన్లకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు

### పట్టణాల అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని సూచన

**ఖమ్మం, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నూతనంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన మేయర్‌లు, చైర్మన్లు, డిప్యూటీ మేయర్‌లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఈ నూతన సారథులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పట్టణాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సిరిపురపు లలితకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోట ధనమూర్తి, సత్తుపల్లి చైర్మన్ రెహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, వైరా చైర్మన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, అశ్వారావుపేట చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఏదులాపురం చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కల్లూరు చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరిలను అభినందించారు.

మిగతా 2లో..

## కాంగ్రెస్-బీజేపీ అపవిత్ర కలయిక: హరీష్ రావు విమర్శలు

- బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యమని ఆరోపణ
- మున్సిపల్ ఫలితాలపై తీవ్ర స్పందన



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీలు జెండాలు, అజెండాలను పక్కనపెట్టి అధికార పీఠం కోసం దిగజారాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు ఆరోపించారు. మార్పు అంటే బీజేపీతో జత కట్టడమేనా అని ప్రశ్నించారు.

మిగతా 2లో..

## వరి రైతులకు బోనస్ బకాయిల విడుదల

### రూ.514.36 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. 2.17 లక్షల మంది రైతులకు లాభం



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

వరి రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. పెండింగ్‌లో ఉన్న వరి బోనస్ బకాయిలుగా రూ.514.36 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో సుమారు 2.17 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వరి సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. 202526 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతులకు ఈ బోనస్ వర్తించనుంది. కనీస మద్దతు ధరకు అదనంగా ఈ రూ.500 చెల్లింపులు జరుగుతున్నాయి. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, రైతులను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. బకాయిల విడుదలతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో నగల దుకాణంలో భారీ దోపిడీ

రూ.1 కోటి విలువైన ఆభరణాల అపహరణ




2లో

## హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ప్రత్యేక నజర్

### ఎనిమిది పట్టణాలకు ఇన్‌ఛార్జుల నియామకం

### ఎన్నికలు సాఫీగా నిర్వహించడమే లక్ష్యం



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలు, కుట్రలు చేస్తున్నదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎనిమిది కీలక పట్టణాలకు సీనియర్ నాయకులను ప్రత్యేక ఇన్‌ఛార్జులుగా నియమించారు.

మిగతా 2లో..

## కరీంనగర్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం

### మొట్టమొదటి బీజేపీ మేయర్ ప్రమాణ స్వీకారం..

### కార్యకర్తల కృషికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కృతజ్ఞతలు



2లో

## ఆమనగల్‌లో బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కు: ఉప్పాల వెంకటేష్

- బీఆర్ఎస్ భయంతో రెండు పార్టీలు ఒక్కటయ్యాయని ఆరోపణ
- రాజీనామాలకు సిద్ధమని సవాల్



**ఆమనగల్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆమనగల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి భయపడి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒక్కటయ్యారని బీఆర్ఎస్ నాయకుడు ఉప్పాల వెంకటేష్ ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం రెండు పార్టీలు చేతులు కలిపాయని విమర్శించారు.

మిగతా 2లో..

## మున్సిపల్ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం: భట్టి విక్రమార్క

### 90–95 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా

### పట్టణాల అభివృద్ధికి కట్టుబాటు



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చారిత్రాత్మక విజయాన్ని అందించిన పట్టణ ఓటర్లందరికీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ మంత్రి తుమ్మల భేటీ

### రెండు రాష్ట్రాల సమన్వయంపై చర్చ... సరిహద్దు అభివృద్ధి అంశాలు ప్రస్తావన

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హైదరాబాద్‌లో నగల దుకాణంలో భారీ దోపిడీ


**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని పంజాగుట్ట ప్రాంతంలో ఉన్న ప్రముఖ నగల దుకాణంలో భారీ దోపిడీ వెలుగులోకి వచ్చింది. దుకాణంలో పని చేసే ఉద్యోగి సుమారు రూ.1 కోటి విలువ చేసే ఆభరణాలను దొంగిలించినట్టు పోలీసులు వెల్లడించారు. పంజాగుట్టలోని జోయ్ అలుక్కాస్ నగల దుకాణంలో పనిచేస్తున్న అజిత్ అనే ఉద్యోగి ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా రోజూ కొద్దికొద్దిగా ఆభరణాలను దొంగిలించినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. విలువైన నగలు కనిపించక పోవడంతో యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. దొంగిలించిన ఆభరణాల వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనలో నిందితుడికి మరెవరైనా సహకరించారా? లేక అతడే స్వయంగా ఈ చర్యకు పాల్పడ్డాడా? అనే అంశంపై పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

# కరీంనగర్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం

**కరీంనగర్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తొలిసారిగా భారతీయ జనతా పార్టీ మేయర్ ప్రమాణ స్వీకారం చేయడం చరిత్రాత్మక ఘట్టమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్‌గా వై. సునీల్ రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఇది కేవలం రాజకీయ విజయం మాత్రమే కాకుండా భావోద్వేగ క్షణమని బండి సంజయ్ అన్నారు. కార్పొరేటర్‌గా వార్డుల వారీగా పాదయాత్రలు చేసిన రోజుల నుంచి ఈ రోజు వరకు సాగిన ప్రయాణం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టిపై విశ్వాసం ఉంచిన ఓటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయానికి ప్రతి కార్యకర్త కృషి కారణమని ఆయన స్పష్టం చేశారు. ఒత్తిళ్లు, బెదిరింపులు, అవమానాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పోరాడిన కార్యకర్తలే ఈ విజయానికి పునాది వేశారని పేర్కొన్నారు. కుట్రలు, ఒత్తిడి రాజకీయాల మధ్య కూడా బీజేపీ దృఢంగా నిలిచి విజయాన్ని సాధించిందన్నారు. కరీంనగర్ ప్రజలు మేయర్‌ను మాత్రమే ఎన్నుకోలేదు, చరిత్రను సృష్టించారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కేంద్ర నాయకత్వం అందించిన మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ మంత్రి తుమ్మల భేటీ

- రెండు రాష్ట్రాల సమన్వయంపై చర్చ
- సరిహద్దు అభివృద్ధి అంశాలు ప్రస్తావన



**అమరావతి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, పరస్పర సహకారంతో పరిష్కరించాల్సిన పలు కీలక అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి తుమ్మల వివరించారు. ముఖ్యంగా రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే మార్గాల నిర్మాణం పూర్తిచేస్తే తెలుగు రాష్ట్రాల ప్రజలకు మరింత లాభం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన వివరణాత్మక వివరాలను ముఖ్యమంత్రికి సమర్పించినట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉన్నత స్థాయి చర్చల ద్వారా పెండింగ్ సమస్యలను పరిష్కరించగలవని తుమ్మల నాగేశ్వరరావు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పరస్పర అవగాహనతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# కొలువుదీరిన పురపాలక పాలకులు

(మొదటి పేజీ తరువాయి)

పట్టణాల అభివృద్ధిలో ప్రతి వార్డు, ప్రతి డివిజన్ పురోగమించాలంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, ప్రజా సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందుబాటులో ఉండి పారదర్శకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. కొత్త పాలకవర్గాలు సమన్వయంతో పనిచేస్తే పట్టణాల రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.





## హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌కు శుభాకాంక్షలు: పొన్నం ప్రభాకర్

- నూతన వైస్ చైర్మన్‌కు అభినందనలు
- పట్టణాభివృద్ధికి కట్టుబాటు

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దండి లక్ష్మి కొమురయ్యకు, వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన చిత్తారి పద్మ రవీందర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల విశ్వాసంతో బాధ్యతలు స్వీకరించిన నూతన నాయకులు పట్టణ అభివృద్ధి దిశగా సమర్థంగా పనిచేయాలని ఆకాంక్షించారు. పారదర్శకత, ప్రజాహిత భావనతో పాలన కొనసాగించాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మౌలిక వసతుల బలోపేతం, ప్రజా సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన పాలక వర్గం ముందుకు సాగాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలపై కేటీఆర్ ఆగ్రహం

- కిడ్నాప్‌లు, దాడులతో పదవుల కొల్లగొట్టే కుట్ర ఆరోపణ
- డీజీపీ, ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలంటూ డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలోని పలు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన ప్రభుత్వం పోలీసు బలగాలను అడ్డుపెట్టుకొని గూండాల మాదిరిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎక్స్ అఫీషియో ఓట్ల పేరుతో దొంగ ఓట్లను నమోదు చేసుకొని పదవులు పొందాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని విమర్శించారు. తొర్రూరు, జనగామ, క్యాతనపల్లి, కాగజ్‌నగర్ తదితర పట్టణాల్లో చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ, గెలిచిన ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేసే ప్రయత్నాలు, దాడులు, బెదిరింపులు జరగడం రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతలా దిగజారాయో చూపుతున్నాయని అన్నారు. పలు చోట్ల మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ అనుచరులు దాడులు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఒత్తిడితో కోరం ఉన్న చోట్ల కూడా ఎన్నికలను వాయిదా వేయడం ఎన్నికల ప్రక్రియను అవమానపరిచే చర్య అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులపై రాష్ట్ర డీజీపీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సంఘం సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సాగిస్తున్న అరాచకాలకు తెలంగాణ ప్రజలే తగిన సమాధానం చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## 20 ఏళ్ల సమస్యకు హైడ్రా పరిష్కారం

- చక్రపురి కాలనీ వాసులకు కమిషనర్ సత్కారం
- పార్కు, రహదారులు కబ్జా నుంచి విముక్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదానికి హైడ్రా పరిష్కారం చూపడంతో సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీ వాసులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. సమస్య పరిష్కారంలో కాలనీ సంక్షేమ సంఘం చూపిన చొరవ ఆదర్శనీయమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సమస్యపై ఫిర్యాదు చేయడమే కాకుండా అవసరమైన పత్రాలను సమర్పించి అధికారులకు సహకరించిన తీరు ప్రశంసనీయమన్నారు. హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ కాలనీ వాసులను సత్కరించారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు కమిషనర్‌ను అభినందించేందుకు వచ్చిన కాలనీ ప్రతినిధులు, మాకు సత్కారం చేస్తారేమిటని ఆశ్చర్యపోయారు. సమస్యలతో సతమతం అవ్వడం కంటే వాటి పరిష్కారానికి ప్రతి కాలనీ సంఘం కృషి చేయాలని కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయిలో చొరవ తీసుకున్న హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ సేవలను కూడా ఆయన అభినందించారు. కాలనీ ప్రతినిధుల వివరాల ప్రకారం, 1985లో 80 ఎకరాల్లో 750 ప్లాట్లతో ఏర్పాటైన లేఅవుట్‌లో 1253.8 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైంది. పక్కనే ఉన్న వ్యవసాయ భూమి యజమానులు సుమారు మూడున్నర ఎకరాల మేర లేఅవుట్‌లోకి చొరబడి పార్కులు, రహదారులు, ప్లాట్లను ఆక్రమించినట్లు గుర్తించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇరుపక్షాల పత్రాలను పరిశీలించారు. వెంటనే పార్కు ప్రాంతానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కబ్జా చేసిన 30 ప్లాట్లను విముక్తి కల్పించారు. దీంతో కాలనీ ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. అలాగే బాచుపల్లి నుంచి చక్రపురి కాలనీ మీదుగా అమీన్‌పూర్ వెళ్లే 200 అడుగుల రహదారి కూడా క్లియర్ కావడంతో వేలాది మంది రాకపోకలకు సౌలభ్యం కలిగింది. ఈ రహదారి అభివృద్ధి పనులను మున్సిపల్ అధికారులు త్వరితగతిన చేపట్టాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో హైడ్రా చూపిన చొరవకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ప్రత్యేక నజర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఆయా మున్సిపాలిటీల స్థానిక నాయకత్వం, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ స్వయంగా మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ అక్రమ కిడ్నాప్‌లు, బెదిరింపులు, పోలీసుల దుర్వినియోగం వంటి అంశాలపై ఆరా తీశారు. స్థానిక నాయకత్వానికి పార్టీ మొత్తం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు సీనియర్ నేతలను వెంటనే క్షేత్రస్థాయికి పంపినట్లు తెలిపారు. రేపు ఎన్నికలు జరగనున్న ఎనిమిది మున్సిపాలిటీలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ఈ పట్టణాల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని పార్టీ ధీమా వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినా తమ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేసింది. ఇన్‌ఛార్జుల వివరాలు ఇలా ఉన్నాయి. తొర్రూర్‌కు ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. జనగామకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. క్యాతనపల్లికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్‌కు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నియమితులయ్యారు. ఇంద్రేశంకు ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కాగజ్‌నగర్‌కు మాజీ మంత్రి జోగు రామన్న, జహీరాబాద్‌కు ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి నియమితులయ్యారు. ఇబ్రహీంపట్నంకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇన్‌ఛార్జులుగా వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందనే నమ్మకంతో బీఆర్ఎస్ నేతలు ముందుకు సాగుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం: భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల తీర్పు తమ ప్రభుత్వ పాలనపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. బాధ్యతాయుతమైన, పారదర్శక పాలనతో పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల బలోపేతం, ప్రజా సేవల మెరుగుదల, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు. ఈ విజయం ప్రజల విజయం అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజల మద్దతు తమకు మరింత బాధ్యతను తీసుకొచ్చిందని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## ఆమనగల్‌లో బీజేపీ–కాంగ్రెస్ కుమ్మక్కు: ఉప్పాల వెంకటేష్

(మొదటి పేజీ తరువాయి)

దేవుడి మీద ప్రమాణం చేసి పార్టీ మారనని చెప్పి తర్వాత పార్టీ మారిన కౌన్సిలర్ పత్య నాయక్‌పై తీవ్రంగా స్పందించారు. ప్రజలను మోసం చేసిన వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ 15 వార్డుల్లో ఒక్క వార్డు మాత్రమే గెలిచి కూడా మున్సిపాలిటీని కైవసం చేసుకున్నామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. తమ బీఆర్ఎస్ ఏడుగురు కౌన్సిలర్లతో రాజీనామా చేయించడానికి సిద్ధమని, దమ్ముంటే కాంగ్రెస్, బీజేపీ తమ కౌన్సిలర్లతో రాజీనామా చేయించి మళ్లీ ప్రజల తీర్పు కోరాలని సవాల్ విసిరారు. అసెంబ్లీలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మున్సిపల్ చైర్మన్ కోసం ఒక్కటయ్యారని విమర్శించారు. రెండు పార్టీల దౌర్జన్యాన్ని ప్రజలు గమనిస్తున్నారని, సమయం రాగానే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఉప్పాల వెంకటేష్ అన్నారు. తమకు ఉన్న ఏడుగురు కౌన్సిలర్లతో మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై నిరంతరం నిలదీస్తామని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్–బీజేపీ అపవిత్ర కలయిక: హరీష్ రావు విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

గత పన్నెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్‌ను బీజేపీ బీ టీమ్ అని, కాంగ్రెస్‌ను బీ టీమ్ అని ఆరోపించిన రెండు పార్టీలు ఇప్పుడు తెలంగాణ వ్యతిరేక టీమ్‌గా మారాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి సింగిల్ టీమ్‌గా మారిపోయాయని, ఈ అపవిత్ర కలయికను ప్రజలు గుర్తించారని హరీష్ రావు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు పార్టీల మధ్య ఉన్న బంధం మున్సిపల్ ఫలితాలతో మరోసారి స్పష్టమైందన్నారు. బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా సిద్ధాంతాలను పక్కనబెట్టి పదవులు పంచుకుంటున్నారని విమర్శించారు. అలియాబాద్, అమన్ గల్, మెదక్, నర్సాపూర్ వంటి ప్రాంతాల ఫలితాలు దీనికి సాక్ష్యమని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేదని, అందుకే బీజేపీతో కుమ్మక్కైందని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు కలిసి ఫలితాలను తారుమారు చేసి మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బీజేపీపై పోరాటం చేస్తున్నామని చెప్పే కాంగ్రెస్ నేతలు, ఇక్కడ మాత్రం బీజేపీతో చేతులు కలుపుతున్నారని అన్నారు. రాజ్యాంగం గురించి మాట్లాడే నేతలు తెలంగాణలో మాత్రం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. నర్సాపూర్, సిర్పూర్ కాగజ్‌నగర్, మెట్‌పల్లి, అమన్ గల్ వంటి ప్రాంతాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కాంగ్రెస్, బీజేపీలు పంచుకున్నాయని హరీష్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్న చోట్ల కూడా కుట్రలు చేసి అధికారాన్ని చేజిక్కించుకుంటున్నారని మండిపడ్డారు. అధికార యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను వాడుకుంటూ ప్రజా తీర్పును హైజాక్ చేయాలని చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఒంటరిగా ఎదుర్కోలేక రెండు జాతీయ పార్టీలు ఒక్కటై దాడి చేస్తున్నాయని, ఇది తమ పార్టీ బలానికి నిదర్శనమని హరీష్ రావు వ్యాఖ్యానించారు. ఈ అపవిత్ర కలయికను తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోందని, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్, బీజేపీలకు సమాధానం చెబుతారని స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం- 17 - ఫిబ్రవరి 2026


# సత్తుపల్లి వైస్ చైర్‌పర్సన్‌గా బొంతు సుమలత

- మూడో వార్డు ప్రజల విశ్వాసానికి ప్రతిఫలం
- అభివృద్ధే లక్ష్యమన్న నూతన వైస్ చైర్‌పర్సన్.



**సత్తుపల్లి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్‌గా బొంతు సుమలత ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మూడో వార్డు అభ్యర్థిగా విజయం సాధించిన ఆమెను ఈ పదవికి ప్రకటించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వం అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. సత్తుపల్లిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపే దిశగా కృషి చేస్తానని, పట్టణ ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా పారదర్శకంగా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. తనపై విశ్వాసంతో గెలిపించిన మూడో వార్డు ప్రజల సేవే తనకు ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ బాధ్యతను ప్రజల ఆశీర్వాదంగా భావించి మరింత అంకితభావంతో పనిచేస్తానని నూతన వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత తెలిపారు.





# కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్‌గా ధరావత్ మోహన్ నాయక్ ఎన్నిక

- వైస్ చైర్మన్‌గా శీలం కోటేశ్వరీ

**సత్తుపల్లి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**
ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో, కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్‌గా ధరావత్ మోహన్ నాయక్ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా శీలం కోటేశ్వరీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి తగ్గట్లుగా పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -16 (తెలంగాణ ముచ్చట్లు)**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వైరా మండలం గన్నవరం గ్రామం నుండి కిన్నెర రాణి, తనకు ఇందిరమ్మ ఇంటికి సంబంధించి మొదటి విడత డబ్బులు జమ అయినట్లు, తదుపరి విడతల డబ్బులు జమకాలేదని, ఇప్పించుటకు కోరగా, హౌజింగ్ పిడి ని పరిశీలించి, తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మంచుకొండ, కోయచిలక గ్రామ రైతులు, తమకు రఘునాధపాలెం మండలం, మంచుకొండ, కోయచిలక రెవెన్యూ శివాయిగూడెం పరిధిలోగల సర్వే నెంబర్లు 174, 175, 362, 364/92 లలో గల స్వంత వ్యవసాయ భూములకు, వైకుంఠదామం, డంపింగ్ యార్డు లకు వెళ్లే దారిని, అట్టి భూమితో సంబంధం లేని వ్యక్తి నిరోధిస్తున్నట్లు, తమకు న్యాయం చేయాలని కోరగా, తహశీల్దార్ ను తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కొనిజర్ల నుండి సయ్యద్ లాల్ బి కొనిజర్ల మండలం, గుండ్రాతిమడుగు రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 421/1/లూ లో 2 ఎకరాల భూమి తన పేరున ఉన్నట్టు, అట్టి భూమిలో 1 ఎకరం తన పెద్ద అమ్మాయికి బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయించినట్టు, మిగిలిన ఎకరం భూమిని తన చిన్న అమ్మాయికి బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయాలని మీ సేవ కేంద్రానికి వెళ్ళగా, అట్టి భూమి అసైన్డ్ భూమిగా చూపిస్తుందని, అట్టి దానిని పిఓపి నుండి తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహశీల్దార్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ గోపాలపురం గ్రామం నుండి ఎస్ కె. రజియా, తనకు ఇల్లు లేదని, భర్త ఆక్సిడెంట్ అయి, ఇబ్బందుల్లో ఉన్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కు దరఖాస్తు చేయగా, హౌజింగ్ పిడి కి పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి.. సంక్షేమం.. ప్రజల అచంచల విశ్వాసం!

- మున్సిపల్ తీర్పుతో విపక్షాల నోళ్లు మూత..
- మున్సిపల్ పోరులో కాంగ్రెస్ 'క్లీన్ స్వీప్'..
- ఇది ప్రజా తీర్పునకు నిదర్శనం!
- మధిర మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 16(తెలంగాణ ముచ్చట్లు)**



"రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఉంచిన నమ్మకమే ఈ మున్సిపల్ ఎన్నికల విజయం" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం మధిరలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ కేవలం గ్రామీణ పార్టీయేనని బురద చల్లిన వారికి ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు" అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం చారిత్రాత్మక విజయమని కొనియాడారు. అసెంబ్లీ, పార్లమెంటు, పంచాయతీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓటర్లు భారీ మెజారిటీని కట్టబెట్టారని, విజయం అందించిన ప్రతి ఓటరుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమన్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర మంత్రిమండలి సమిష్టిగా పనిచేస్తూ.. అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సమతూకంతో ముందుకు తీసుకెళ్ళి, అర్బన్ సెంటర్లను అభివృద్ధి బాట పట్టించారని భట్టి పేర్కొన్నారు.

2047 విజన్.. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదిగేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. "మా పోటీ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతోనే. 2047 విజన్ డాక్యుమెంట్ ద్వారా తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మారుస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు.

**ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, పారిశ్రామికీకరణ ద్వారా భారీగా ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన వివరించారు. విస్తరిస్తున్న పట్టణాలను అభివృద్ధి చేయడానికి మున్సిపల్ శాఖ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం "ప్యూర్ క్యూర్ రేర్" (Pure Cure Rare) విధానంతో ముందుకు సాగుతున్నారు. మున్సిపల్ పరిపాలనలో జవాబుదారీతనం పెంచడానికి మరియు పౌరులకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్యూర్ క్యూర్ రేర్" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఈ మీడియా సమావేశంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వర్ రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రామనాథం, మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన దని కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటరమణ, నూతనంగా గెల్చిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

- చైర్మన్‌గా మహమ్మద్ రెహనా బేగం కమల్ పాషా విజయం.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**






ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సత్తుపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించింది. 22వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మహమ్మద్ రెహనా బేగం కమల్ పాషా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికై పట్టణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజల విశ్వాసం, పార్టీ నాయకత్వం మద్దతుతో ఘన విజయం సాధించిన ఆమెకు పార్టీ శ్రేణులు, అభిమానులు అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ఉత్కంఠభరితంగా సాగగా చివరికి కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం లభించింది. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని, పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యాలుగా ఉంటాయని నూతన చైర్మన్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమని, రాజకీయ భేదాలకు అతీతంగా పట్టణ ప్రగతే లక్ష్యంగా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్లకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమ విజయానికి నాయకత్వం ఇచ్చిన మార్గదర్శకం, పార్టీ శ్రేణుల అంకితభావం, ప్రజల ఆశీర్వాదమే కారణమని పేర్కొంటూ, పట్టణ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. విజయానంతరం పార్టీ కార్యకర్తలు సంబరాలు జరుపగా, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.

# పట్టుదలతో దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -16 (తెలంగాణ ముచ్చట్లు)**




పట్టుదలతో ముందడుగు వేసి దివ్యాంగ విద్యార్థులు అన్ని క్రీడా విభాగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దివ్యాంగ చిన్నారుల రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ఖమ్మం జిల్లా నుండి వివిధ క్రీడా విభాగాలలో ఎంపికైన దివ్యాంగ విద్యార్థుల బృందానికి సోమవారం కలెక్టర్‌లో జిల్లా కలెక్టర్ అభినందించారు. వారి బస్సు ప్రయాణానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయని, ఎందులోను మేము ఎవరికి తక్కువ కాదని, ఎల్లప్పుడూ అన్ని రకాల ఆటల పోటీలలో పాల్గొంటూ ఉండాలని అన్నారు. హైదరాబాదులో జరుగుతున్న రాష్ట్రస్థాయి దివ్యాంగ చిన్నారుల ఆటల పోటీలకు ఖమ్మం జిల్లా తరుపున అండర్14, అండర్ 16 విభాగంలో 20 మంది వివిధ పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మానసిక వైకల్యం, అంధత్వం, బధిరత్వం, శారీరక అంగవైకల్యం మొదలగు కేటగిరీలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తారని వివరించారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ బాజోజు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగ చిన్నారుల బృందానికి సహాయకులుగా ఐదుగురు ఐఆర్పిలు, ఇద్దరూ స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఇద్దరు కేర్ గివర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్ళుతున్నారని వెల్లడించారు. క్రీడా పోటీలలో పథకాలు సాధించి విజేతలుగా నిలవాలని, ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ మనోధైర్యం కల్పించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి భవిష్యత్తులో మరింత మంచి నైపుణ్యాన్ని కనబర్చి కష్టపడి ఆడితే క్రీడల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడలతో పాటు విద్యలో రాణించాలని, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడ ముఖ్యమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, ఇన్చార్జి డిఈవో శ్రీనివాసరావు, ఎఎస్పి భాను ప్రకాష్, డిఎస్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచాలి..

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -16(తెలంగాణ ముచ్చట్లు)**





జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజలకు అందించే వైద్యసేవలు, రబీ ధాన్యం సేకరణ, వేసవిలో త్రాగునీటి చర్యలు, రోడ్ సేఫ్టీ పనుల పురోగతి, గ్రామ పంచాయతీ భవనల నిర్మాణాలు, జిల్లా అధికారుల హాజరు లపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రులలో వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. గైర్హాజరు, విధులందు నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాలలో గ్రామ పంచాయతీలకు భవనాలు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇజిఎస్ లో భవనాల నిర్మాణం చేపట్టవచ్చని, ఈ దిశగా మంజూరు పొందేందుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సమస్యలు పరిష్కరించాలని అన్నారు. హ్యాండ్ పంప్ ల మరమ్మత్తులు, నీటివనరుల గుర్తింపు పూర్తి చేయాలన్నారు. రబీ సీజన్ దిగుబడి అంచనాలకు తగ్గట్టు కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టికి పెట్టుకొని, సమస్యలను అధిగమించాలన్నారు. గత ధాన్య సేకరణలో ఎదురైన సమస్యలు అధిగమించడానికి పరిష్కార చర్యలతో సిద్ధంగా ఉండాలన్నారు. మిల్లర్లకు కొనుగోలుపై ముందే అవగాహన కల్పించాలని, సమస్యలుంటే ముందుగానే పరిష్కరించాలని అన్నారు. ధాన్య కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రమాద ప్రాంతాల్లో రోడ్డు భద్రతా పనులు వేగవంతం చేయాలని, ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ ఆధారంగా గుర్తించిన ప్రధాన 30 బ్లాక్ స్పాట్ లలో స్పీడ్ కంట్రోల్ కు రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్లపై లైన్ మార్కింగ్ తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో జడ్పీ సీఈఓ దీక్షా రైన, ఆర్&బీ ఎస్ఈ యాకుబ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, జిల్లా డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. చందునాయక్, జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, డిపివో రాంబాబు, మిషన్ భగీరథ ఇఇ లు పుష్పలత, వాణిశ్రీ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం- 17 - ఫిబ్రవరి 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## మహిళాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం.!

- సత్తుపల్లి మున్సిపల్ చరిత్రలో కొత్త అధ్యాయం
- ఎమ్మెల్యే–చైర్‌పర్సన్–వైస్ చైర్‌పర్సన్‌గా మహిళలే

**సత్తుపల్లి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**


ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మహిళలకు కీలక పదవులు దక్కడం సత్తుపల్లి రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులు మహిళలకు కేటాయించడం మున్సిపాలిటీ చరిత్రలో అరుదైన పరిణామంగా నిలిచింది. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి మైనారిటీ వర్గాలకు తగిన ప్రాధాన్యం దక్కలేదనే అభిప్రాయాల మధ్య, ఈసారి వారికి అవకాశాలు కల్పించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గత పదేళ్లలోనూ, అలాగే బిఆర్ఎస్ హయాంలోనూ ఇలాంటి పరిస్థితి కనిపించలేదని తెలిపారు.

ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ కష్టకాలంలో తమ వెంట నిలిచిన ఎండీ కమల్ పాషా దంపతులను గుర్తించి గౌరవప్రదమైన స్థానం కల్పించడం విశేషంగా మారింది. ఇదే కాకుండా సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవుల్లో మహిళలు బాధ్యతలు చేపట్టడం గమనార్హంగా మారింది. మున్సిపల్ చరిత్రలో తొలిసారిగా మూడు కీలక పదవుల్లో మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా స్థానిక రాజకీయాల్లో కొత్త మార్పుకు శ్రీకారం చుట్టినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మహిళాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నాయకులు పేర్కొన్నారు.



## కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు భక్తుల రద్దీ

**కీసర, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్ జిల్లాలోని కీసరగుట్ట భవాని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నాలుగో రోజు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.మహా శివరాత్రి పర్వదినాన స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు అంగరంగ వైభవంగా నిర్వహించగా, ఆ ఆధ్యాత్మిక ఉత్సాహం నాలుగో రోజు కూడా కొనసాగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ లైన్లలో నిలబడి స్వామివారి దర్శనం పొందారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో మారుమోగింది.ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ తాటాకం వెంకటేష్, పీఈఓ సుధాకర్ రెడ్డి, గుడి పంతులు మరియు ఇతర ఆలయ సిబ్బంది పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఖమ్మం రాజకీయాల్లో సరికొత్త సమీకరణం

- గులాబీ గూటికి సీపీఐ కీలక నేత తనయుడు?

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు)**

జిల్లా రాజకీయాల్లో మరో కీలక మార్పు చోటుచేసుకోబోతోంది. లెఫ్ట్ పార్టీల కంచుకోటగా ఉన్న ఖమ్మం రూరల్ మండలంలో సీపీఐ కి గట్టి ఎదురుదెబ్బ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. సీపీఐకి చెందిన ఒక జాతీయ స్థాయి అగ్ర నాయకుడి కుమారుడు త్వరలోనే భారత్ రాష్ట్ర సమితి తీర్థం పుచ్చుకోనున్నట్లు, సదరు వ్యక్తితో స్వయంగా కేటీఆర్ ఏ మంతనాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

**భారీ జన సమీకరణకు స్కెచ్**

సాధారణ చేరికలా కాకుండా, తన బలాన్ని నిరూపించుకునేలా భారీ బహిరంగ సభ లేదా భారీ ర్యాలీ ద్వారా గులాబీ జెండా కప్పుకోవాలని సదరు నాయకుడు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం రూరల్ మండలంలోని తన అనుచరగణం, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసేందుకు ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి.

**బీఆర్ఎస్ వ్యూహం**


ఖమ్మం జిల్లాలో తిరిగి పట్టు సాధించాలని చూస్తున్న బీఆర్ఎస్ అధిష్టానం, బలమైన సామాజిక వర్గం మరియు రాజకీయ నేపథ్యం ఉన్న నేతలను ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగానే సీపీఐ నేత కుమారుడిని పార్టీలోకి తీసుకురావడం ద్వారా రూరల్ ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని భావిస్తోంది.

ఈ పరిణామంపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇది ఖమ్మం రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తిప్పుతుందో వేచి చూడాలి.

# మధిర మున్సిపల్ పీఠం హస్తం కైవసం

- చైర్‌పర్సన్‌గా సామినేని సుజాత, వైస్ చైర్మన్‌గా కోన ధని కుమార్ ఎన్నిక
- హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఎక్స్ అఫీషియో ఓటు వినియోగం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 16(తెలంగాణ ముచ్చట్లు)**



మధిర మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. పట్టణ ప్రథమ పౌరురాలిగా సామినేని సుజాత, వైస్ చైర్మన్‌గా కోన ధని కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం మధిర ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొని తన ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకున్నారు. ముందుగా అభినందనల వెల్లువ అంతకుముందు, మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా గెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సాదరంగా ఆహ్వానించారు. భారీ మెజారిటీతో విజయం సాధించినందుకు వారిని అభినందించిన ఆయన, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి కౌన్సిలర్లతో కలిసి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు.

ప్రమాణ స్వీకారం.. ఎక్స్ అఫీషియో ఓటు ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నూతన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం జరిగిన ప్రక్రియలో భట్టి విక్రమార్క తన ఎక్స్ అఫీషియో ఓటును వేశారు. మెజారిటీ సభ్యుల మద్దతుతో చైర్పర్సన్ పదవికి సామినేని సుజాత, వైస్ చైర్మన్ పదవికి కోన ధని కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నవీన్ బాబు అధికారికంగా ప్రకటించారు.

**అభివృద్ధికి బాటలు వేస్తాం: భట్టి**

ఎన్నిక అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మధిర మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చూస్తామని, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని కౌన్సిలర్లకు సూచించారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# స్వ రాష్ట్ర కలను సాకారం చేసిన వ్యక్తి కేసీఆర్

- మాజీ ఎంపీ నామ జననేత కేసిఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు
- మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 16(తెలంగాణ ముచ్చట్లు)**



తెలంగాణ స్వరాష్ట్ర కలను నిజం చేసి, సాధించుకున్న తెలంగాణను యావత్ దేశానికి అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన గొప్ప నాయకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు అని పేర్కొన్నారు. మంగళవారం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేయడమే కాకుండా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. రైతుల సంక్షేమానికి రైతుబంధు, రైతుబీమా పథకాలతో ఆర్థిక భరోసా కల్పించారని, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చారని పేర్కొన్నారు. పేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలతో ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా ఇచ్చారని అన్నారు. ఆరోగ్య రంగంలో కేసీఆర్ కిట్, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించారని తెలిపారు. విద్యారంగంలో గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్ల విస్తరణ ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరవై నాలుగు గంటల విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని కొనియాడారు. అలాగే, పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలోనూ కేసీఆర్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. కేసఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని నామ నాగేశ్వరరావు ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ ప్రజల సంక్షేమం కోసం భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జవహర్ నగర్‌లో దివ్యాంగురాలికి మొబైల్ ఫోన్ అందజేత

**జవహర్ నగర్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**



జవహర్ నగర్ సిపిఐ కాలనీలో నివసిస్తున్న నిరుపేద దివ్యాంగురాలు నికితకు ఎన్ సి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ వీర కృష్ణ తేజ ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ అందజేశారు. ఈ కార్యక్రమం తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు.


సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ గుత్తికొండ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, నికిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సహాయం అందించారు. ఎన్ సి గ్రూప్ లక్ష్మి తన మనవడు దత్విక్ చారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు మరియు ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన దివ్యాంగులకు అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎన్ సి గ్రూప్ కమిటీ సభ్యులు జగన్, ప్రశాంత్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, స్థానిక సీనియర్ జర్నలిస్టులు మరియు పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సహాయానికి దివ్యాంగుల తరఫున మెరుగు శివకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదర్శ మున్సిపాలిటీగా అశ్వారావుపేట.!

- సమిష్టి కృషితో అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే జారె.
- నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా.
- చైర్మన్‌గా జూపల్లి శశికళ,
- వైస్ చైర్మన్‌గా జూపల్లి రమేష్ బాబు బాధ్యతలు స్వీకారం.

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**







అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలి చైర్మన్‌గా ఎన్నికైన జూపల్లి శశికళ, వైస్ చైర్మన్‌గా జూపల్లి రమేష్ బాబు, 15 మంది కౌన్సిలర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశ్వారావుపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయ భేదాలను పక్కన పెట్టి ప్రజా సమస్యల పరిష్కారంలో ఏకమై పనిచేయాలని సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

అలాగే తొలి చైర్మన్ జూపల్లి శశికళ మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, ఒక్క కాలనీ కూడా వెనుకబడకుండా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా పారదర్శకంగా సేవలు అందిస్తామని చెప్పారు.

కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గిరిజనులకు కంటపడ్డ శివయ్య.!



- గట్టుగూడెం గుట్టపై శివలింగం దర్శనం.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గట్టుగూడెం గ్రామ చివరలోని గుట్టపై శివలింగం వెలిసినట్లు గిరిజనులు గుర్తించారు. ఈ వార్త చుట్టుపక్కల గ్రామాలకు చేరడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దేవుణ్ణి దర్శించుకోవడానికి గుట్టపైకి వెళ్లేందుకు తరలివచ్చారు. అయితే ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు భక్తులను గుట్టపైకి వెళ్లనీయక ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామస్థులు హిందూ సంఘాల నాయకులకు సమాచారం అందించారు.

గ్రామస్థులకు అండగా నిలిచిన బీజేపీ మరియు హిందూ సంఘాల నాయకులు గుట్టపైకి చేరుకుని శివయ్యను దర్శించుకుని పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తాము అండగా ఉంటామని, దేవుడి విషయంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే సహించబోమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు తంబళ్ల రవి, సీనియర్ నాయకులు విశ్వేశ్వరరావు, రామాదండు మహిళ అధ్యక్షురాలు నాగవర్ధనమ్మ, చారి, మల్లేశ్, గ్రామస్థులు మరియు భక్తులు పాల్గొన్నారు.




# మొయినాబాద్ మున్సిపాలిటీకి కొత్త నాయకత్వం

- చైర్మన్‌గా దూబ సోనియా, వైస్ చైర్మన్‌గా రాజు ఎన్నిక

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు)

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీలో నూతన మున్సిపల్ చైర్మన్‌గా దూబ సోనియా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా రాజు ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యింది. మొదటిసారిగా ఈ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఇద్దరూ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ రాజు మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం. ఎ. ఫహీం, ముదిరాజు కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు మొయినాబాద్ మున్సిపాలిటీలోని ప్రతి గడపకు చేరేలా కృషి చేస్తానని రాజు పేర్కొన్నారు.మున్సిపాలిటీ లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, కాలువలు, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ త్వరలోనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు.మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, అందరూ కలిసి ముందుకు సాగితే మొయినాబాద్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దగలమని నూతన ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# కుట్రపూరిత రాజకీయాలతో నన్ను అడ్డుకున్నారు

- కాంగ్రెస్ లో ధనవంతులకే ప్రాధాన్యం.. నిబద్ధత గల కార్యకర్తకు అన్యాయం
- ధ్యారపోగు వెంకటేష్ ఆవేదన

వనపర్తి,ఫిబ్రవరి16(తెలంగాణ ముచ్చట్లు):



కాంగ్రెస్ పార్టీలో 25 సంవత్సరాలుగా విధేయుడిగా పనిచేసిన తనకు వనపర్తి మున్సిపాలిటీ పురపాలక సంఘ ఎన్నికల్లో అభ్యర్థిత్వం ఇవ్వకుండా కావాలనే అడ్డుకుని అవమానించారని 21వ వార్డు సభ్యుడు ధ్యారపోగు వెంకటేష్ ఆరోపించారు. కుట్రపూరిత రాజకీయాలతో తనను పక్కనబెట్టి, అనంతరం పార్టీ నుంచి బహిష్కరించడం బాధాకరమని ఆయన వాపోయారు.పార్టీ జెండా మోసి నిస్వార్థంగా పనిచేసిన వారికి కాకుండా ధనవంతులకే అవకాశాలు కల్పిస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. జిల్లా సామాజిక మాధ్యమాల సమన్వయ బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ తన సేవలను గుర్తించలేదని తెలిపారు. సర్వేలో తన పేరు ఉన్నప్పటికీ నాయకుల బంధువైన ధనలక్ష్మి అనే మహిళకు అభ్యర్థిత్వం కేటాయించారని పేర్కొన్నారు.ఇతర పార్టీల నుంచి, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి వచ్చిన వారికి అవకాశాలు ఇచ్చారని విమర్శించారు. తనను దళితుడని అవమానించి అభ్యర్థిత్వం నిరాకరించారని ఆరోపించారు. రెబల్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ పార్టీ నాయకులు ఎవరూ సహకరించలేదని అన్నారు.21వ వార్డు ప్రజలు తనను ఆదరించి 297 ఓట్లు ఇచ్చారని, కేవలం ఐదు ఓట్ల తేడాతో ఓడిపోయానని గుర్తు చేశారు. తిరిగి లెక్కింపులో కూడా రాజకీయ ప్రలోభాలతో అన్యాయం జరిగిందని ఆరోపించారు.జిల్లా స్థాయిలో జరిగిన ఈ అన్యాయాన్ని రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, తనపై విధించిన బహిష్కరణను ఎత్తివేసి న్యాయం చేయాలని కోరుతామని వెంకటేష్ స్పష్టం చేశారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి కావాలనే కుట్రపూరితంగా వ్యవహరించి తనకు అవకాశం రాకుండా అడ్డుకుని, గెలవకుండా ప్రయత్నించి రోడ్డుపైకి లాగారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మున్సిపల్ పదవుల ఎన్నికలు పూర్తి

- మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్‌లు, వైస్ చైర్‌పర్సన్‌లు ఎన్నిక
- ప్రత్యేక అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం

మేడ్చల్–మల్కాజిగిరి , ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా సోమవారం జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్‌లు, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక ప్రక్రియ శాంతియుతంగా నిర్వహించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ప్రత్యేక అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.*ఆలియాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా కంటం శిరీష అలియాస్ కంటం శ్వేత (కాంగ్రెస్) ఎన్నిక కాగా, వైస్ చైర్‌పర్సన్‌గా కన్రెడ్డి మాలతి (బీజేపీ) ఎన్నికయ్యారు. వీరితో ప్రత్యేక అధికారి, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి హరిష్ బాబు ప్రమాణ స్వీకారం చేయించారు.*మూడుచింతలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా జాము రవి (బీఆర్ఎస్), వైస్ చైర్‌పర్సన్‌గా మొరుగుబాయి శశిరేఖ (బీఆర్ఎస్) ఎన్నికయ్యారు. వీరితో ప్రత్యేక అధికారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి నాగలింగ చారి ప్రమాణ స్వీకారం చేయించారు.*ఎల్లంపేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా లావుడ్య శ్రీదేవి (బీఆర్ఎస్) ఎన్నిక కాగా, వైస్ చైర్‌పర్సన్‌గా మేకల రజిత (బీజేపీ) ఎన్నికయ్యారు. వీరితో ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పట్టణాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు అధికారులు వెల్లడించారు.

# కాప్రా సర్కిల్‌లోని శ్రీ తులజా భవాని ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా

- అన్నదానం ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు
- ఆరేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పిట్టల రాజు

చర్లపల్లి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు)




ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్, చర్లపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కాలనీలోని ప్రసిద్ధ శ్రీ తులజా భవాని ఆలయంలో శివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా మనీష్ చికెన్ షాప్ ప్రొప్రైటర్ పిట్టల రాజు ఆధ్వర్యంలో భక్తుల కోసం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ముఖ్య అతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతికి ప్రతీకలని, ఇలాంటి పవిత్ర దినాల్లో పేదలకు, భక్తులకు అన్నదానం చేయడం గొప్ప సేవ అని పేర్కొన్నారు.నిర్వాహకులు పిట్టల రాజు తన స్వంత ఖర్చులతో కాలనీ భక్తుల కోసం చేస్తున్న సేవ అభినందనీయమని, యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. అనంతరం పిట్టల రాజు మాట్లాడుతూ, భగవంతుని కృపతో గత ఆరు సంవత్సరాలుగా ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు సేవ చేయడం తనకు ఎంతో తృప్తి ఇస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మురళి పంతులు, కరిపే ప్రవీణ్ వంజరి, పెద్దపురం కుమారుస్వామి, రాజిరెడ్డి, యక్కయ్య, ఏస్ ఎ రహీం, సాయిరెడ్డి, హరి, కృష్ణ, రాజు, రాజేష్, నవీన్, రామ్, నర్సింహా, శ్రీనివాస్, విజయ్, కాలనీ ముఖ్య నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వనపర్తి మున్సిపల్ చైర్మన్ మిడిదొడ్డి మాధవిని కలిసిన వెల్టూర్ కాంగ్రెస్ నాయకులు

వనపర్తి,ఫిబ్రవరి16(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి మున్సిపల్ చైర్మన్‌గా మిడిదొడ్డి మాధవి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వెల్టూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు వడ్డే శేఖర్ మాట్లాడుతూ..మాధవి నాయకత్వంలో వనపర్తి పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకంగా పాలన అందించాలని కోరారు. పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో చైర్మన్ కృషి చేయాలని ఆకాంక్షించారు.మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో ఇంటింటికి తిరుగుతూ గెలుపుకు కృషి చేసిన వడ్డే శేఖర్ బృందాన్ని చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, మిల్లర్ రాజు, చందు రెడ్డి, కుమ్మరి కొండన్న తదితరులు పాల్గొన్నారు.





# ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన ఎల్లంపేట మున్సిపాలిటీ ప్రతినిధులు

మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):

ఎల్లంపేట మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎల్లంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మరియు బండమాదారం 19వ వార్డు కౌన్సిలర్ మేకల రజిత దేవేందర్ రెడ్డి, గుమ్మడిదల మహేశ్వరి, 6వ వార్డు కౌన్సిలర్ రాజేష్, 24వ వార్డు కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్, 2వ వార్డు కౌన్సిలర్ బుక్య శారద రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు మరియు భవిష్యత్ ప్రణాళికలపై ఎంపీతో చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న ప్రజాప్రతినిధులను ఎంపీ అభినందించారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు.

# మూడుసార్లు వార్డు నెంబర్‌గా గెలుపొందిన... మాదినేని సునీత

- హ్యాట్రిక్ విజయం ఆమెపై ప్రశంసల జల్లు..

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు)



వైరా మున్సిపాలిటీ తో పాటు, వైరా మేజర్ గ్రామపంచాయితీలో వరుసగా మూడుసార్లు వేర్వేరు వార్డుల్లో పోటీ చేసి ఓ మహిళ కౌన్సిలర్ గా గెలుపొందింది. ఆమె మూడు ఎన్నికల్లో వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించింది. ఆమె మాదినేని సునీత. వైరా మేజర్ గ్రామపంచాయితీ గా ఉన్నప్పుడు 6వ వార్డులో సునీత గెలుపొందారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ తరపున 2018 మున్సిపాలిటీ ఎన్నికల్లో 5వ వార్డు నుంచి విజయ డంకా మోగించారు. ప్రస్తుతం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఆమె 12వార్డు నుంచి మరోసారి కౌన్సిలర్ గా గెలుపొందారు. ఆమె విజయంలో భర్త మాదినేని ప్రసాద్ కీలకపాత్ర పోషించారు. వైరా మున్సిపాలిటీ చరిత్రలో వరుసగా మూడోసారి విజయం సాధించిన మాదినేని సునీతకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.



# వైరాను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా బాధ్యత నాదే..

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క..

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు)

వైరా మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో మోడల్ మున్సిపాలిటీగా తీర్చే బాధ్యత తనదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వైరా మున్సిపాలిటీలో మొదటి మహిళా చైర్మన్ గా కాపా చంద్రకళ ఎన్నికైన వెంటనే వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్ కాంగ్రెస్ జిల్లా పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ , మాజీ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ తో కలిసి ఆమె మధిర వెళ్లారు అక్కడ ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క చంద్రకళకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు అందుకు ప్రతిగా ఆమె ఉపముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అభివృద్ధి బాధ్యత తనదైనని స్పష్టం చేశారు మున్సిపాలిటీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని తన నెరవేరుస్తానని చెప్పారు వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఓటర్లకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఖమ్మం జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా సేవలందిస్తున్న డాక్టర్ కాపముల్లో కృష్ణ చంద్రకళ దంపతులను రాజకీయంగా కూడా రాణించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రుం వరలక్ష్మి శ్యాంబాబు నాలుగో వార్డ్ కౌన్సిలర్ నిమ్మతోట శ్రావణి లగడపాటి ప్రభాకర్ రావు లగడపాటి లక్ష్మీ రాజ్యం శీలం చంద్రశేఖర్ రెడ్డి వీరశెట్టి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య సోమవారం ఉదయం కూసుమంచి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కూసుమంచిలోని గణపేశ్వర ఆలయంలో దర్శనం కోసం కుటుంబ సమేతంగా తన కారులో వెళ్తుండగా.. ఉదయం 7 గంటల సమయంలో ఒక్కసారిగా ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో కారు చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బత్తుల సోమయ్య తీవ్రమైన గాయాలు అయ్యాయి. తన భార్య కు చేయి విరిగింది. బత్తుల సోమయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ద్విచక్ర వాహనం పై వెళ్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పేద విద్యార్థికి అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

- ఎంబీబీఎస్ విద్యార్థి తేజ నాయక్‌కు రూ.10 వేల నగదు అందజేత

**పెద్దమందడి,ఫిబ్రవరి16(తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండలం అనకాయపల్లి తండాకు చెందిన గోపాల్ నాయక్ కుమారుడు తేజ నాయక్ వైద్య విద్యలో ప్రవేశం పొంది మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అభ్యసిస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థికి ఆర్థిక సహాయం అందించాలని తండా వాసులు అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ను సంప్రదించారు.దీంతో ఫౌండేషన్ తరపున పుస్తకాల కొనుగోలు కోసం రూ.10 వేల నగదును సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా డా. సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ సేవలందిస్తున్న ఫౌండేషన్‌ను అభినందించారు. తేజ నాయక్ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.విద్యార్థి తేజ నాయక్ మరియు అతని కుటుంబ సభ్యులు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎంఎంసి కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

**చర్లపల్లి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వినయ్ కృష్ణ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చర్లపల్లి డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. చర్లపల్లి ప్రాంతంలో రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, కాలనీల్లో మౌలిక వసతుల మెరుగుదల వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ అభ్యర్థనపై కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరీ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మణిగిల్లలో మార్నింగ్ వాక్ సందర్భంగా నీటి సమస్యలపై సమీక్ష

- మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి పరిశీలన
- సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

**పెద్దమందడి, ఫిబ్రవరి16 (తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో ఉదయం నిర్వహించిన మార్నింగ్ వాక్ సందర్భంగా గ్రామ నూతన సర్పంచ్ పలుసు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రత్యేకంగా పరిశీలించారు.రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందుతున్నదా లేదా అనే అంశాన్ని తెలుసుకున్నారు.ఇళ్ల వద్ద నీటి సరఫరా విధానం, ఒత్తిడి సమస్యలు తదితర అంశాలపై గ్రామస్తులతో చర్చించారు.నీటి సరఫరా అందని ఇళ్లకు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేసి సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.కంట్రోల్ వాల్వులు సరిగా బిగించుకుంటే నీటి సమస్య తగ్గుతుందని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముప్పారి గణేష్ కుమార్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు పోతుల రామిరెడ్డి, ఎస్ రాములు, పోతుల ప్రతాప్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, బుచ్చన్న, గొంది రామకృష్ణారెడ్డి, దానేలు కొములయ్య, బాలరాజ్, మందడి శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, బి.కె.నాయుడు, సుంచరమోని తిరుపతి, ముప్పారి సాయికుమార్, సింగం రాజు తదితరులు పాల్గొన్నారు.



## మల్లాపూర్‌లో చాందిని క్రికెట్ టోర్నమెంట్ ఘన ప్రారంభం

_కాంగ్రెస్ ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

**మల్లాపూర్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ బండబావి కమ్యూనిటీ హాల్‌లో పరమేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాందిని క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.పరమేశ్వర యూత్ అధ్యక్షులు నాగి ముదిరాజ్, శివ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుండి ఆరోగ్యంగా, క్రమశిక్షణతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. మల్లాపూర్ డివిజన్‌లో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరింతగా జరగాలని ఆకాంక్షించారు.కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ పరమేశ్వర్ రెడ్డి హాజరుకావడంతో యువతలో మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన పరమేశ్వర యూత్ అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మక్తాల బాలరాజ్ గౌడ్, తాంద్ర శ్రీకాంత్ రెడ్డి, జానీ వేణు, నిక్కీ గౌడ్, టిల్లు, కప్పర సాయి, ఎస్.వి. కిట్టు, సురేష్ గౌడ్, పర్వతాలు, వెంకన్న, జయంత్, వినేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ

- ఆంధ్రాలో కలిసిన 5 పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇవ్వడి
- తిరుమలలో తెలంగాణకు 5 ఎకరాల స్థలం కేటాయింపుకు విజ్ఞప్తి
- తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయంతో సాగుదాం
- సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల కీలక చర్చలు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 16(తెలంగాణ ముచ్చట్లు)**





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్‌లూమ్స్ & టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాలకు సంబంధించి పలు కీలక విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. పునర్విభజనలో తలెత్తిన పరిపాలనా సమస్యల నుంచి సాగునీటి ప్రాజెక్టులు, దేవస్థానాల అభివృద్ధి, రైల్వే లైన్ల నిర్మాణం వరకు విస్తృత అంశాలపై మంత్రి విజ్ఞప్తులు చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయం పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.

**పునర్విభజనలో కలిసిన 5 గ్రామాలు... తెలంగాణలో విలీనం చేయాలి**

రాష్ట్ర విభజన సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న యేటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో కలిసిపోయిన విషయాన్ని మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. భౌగోళికంగా ఇవి తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటంతో ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తోందని, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఈ గ్రామాలు ఎంక్లేవ్‌లా మారిపోయాయని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు.

**భద్రాచలం దేవస్థాన పరిపాలనలో ఇబ్బందులు**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన కొంత భూభాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటంతో దేవస్థానం పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి తెలిపారు. భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే ఈ గ్రామాల విలీనం కీలకమని అభిప్రాయపడ్డారు.

**పెద్దవాగు ప్రాజెక్ట్‌కు 85:15 నిష్పత్తిలో నిధులు**

ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తులు అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో 13,640 ఎకరాలు (85.25%) ఆంధ్రప్రదేశ్‌లో, 2,360 ఎకరాలు (14.75%) తెలంగాణలో ఉన్నాయని వివరించారు.

ప్రాజెక్ట్ పునరుద్ధరణకు రూ.92.20 కోట్ల వ్యయం అంచనా వేయబడిందని, రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల జీవనాధారం ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడినందున తక్షణ ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**భద్రాచలం వరద రక్షణ కరకట్టకు తక్షణ మరమ్మత్తులు**

ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్న గోదావరి వరద రక్షణ కరకట్టలో 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న అంశాన్ని మంత్రి ప్రస్తావించారు. భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించేందుకు నిర్మించిన ఈ కరకట్టలో ఏర్పడిన నష్టం భవిష్యత్తులో ప్రమాదానికి దారితీయొచ్చని హెచ్చరించారు.

విభజన అనంతరం ఆ భాగం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు తలెత్తాయని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఆంధ్రప్రదేశ్ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. వెంటనే సాంకేతిక పరిశీలన చేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ ప్రారంభించాలని కోరారు.

**ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి విజ్ఞప్తి**

ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి భూమి గుర్తింపు పూర్తయిందని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరారు. స్థానిక భక్తుల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేర్చే దిశగా ప్రభుత్వం సహకరించాలని అభ్యర్థించారు.

తిరుమలలో తెలంగాణకు 5 ఎకరాల స్థలం

తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి ప్రతిపాదించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వసతి కొరత తగ్గి భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించవచ్చని పేర్కొన్నారు.

**రైల్వే లైన్ల నిర్మాణానికి సహకారం కోరిన మంత్రి**

సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి-అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ లైన్లు అమలులోకి వస్తే వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

**సమన్వయంతో ముందుకు...**

సాగునీరు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, మౌలిక వసతుల విస్తరణలో రెండు రాష్ట్రాలు పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగితే వేగవంతమైన పురోగతి సాధ్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేరడలో కబడ్డీ హోరు.. డాన్స్ ప్రోగ్రాంతో అదిరిన జోరు!

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 16(తెలంగాణ ముచ్చట్లు)**





నేరడ గ్రామంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న 45వ వార్షిక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి.

పగలు మైదానంలో క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు సాగగా, రాత్రి వేళ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు గ్రామస్తులను, క్రీడాభిమానులను మంత్రముగ్ధులను చేశాయి.

**'డాన్స్ బేబి డాన్స్'తో హోరెత్తిన ప్రాంగణం**

రెండో రోజు రాత్రి 8 గంటల నుండి ప్రారంభమైన "డాన్స్ బేబి డాన్స్" కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**యువత కేరింతలు**

ప్రముఖ డ్యాన్స్ మాస్టర్లు, స్థానిక కళాకారులు సినీ గీతాలకు వేసిన స్టెప్పులతో వేదిక దద్దరిల్లింది. క్రీడాకారులు కూడా తమ అలసటను మర్చిపోయి ఈ వినోద కార్యక్రమాన్ని ఆస్వాదించారు.

**సాంస్కృతిక వైవిధ్యం**

కేవలం వెస్ట్రన్ డాన్స్‌లే కాకుండా, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద నృత్యాలు మరియు భక్తి గీతాలపై ప్రదర్శించిన కళారూపాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

**భారీ జనసందోహం**

చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు తరలిరావడంతో నేరడ గ్రామం ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది.

**కబడ్డీ పోటీల అప్‌డేట్**

రెండో రోజు జరిగిన కీలక మ్యాచుల్లో జట్లు సెమీఫైనల్ బెర్తుల కోసం గట్టిగా పోటీ పడ్డాయి. నేతాజీ యువజన సంఘం ప్రతినిధులు, నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



## వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి రుద్రాభిషేకం

**ఖమ్మం బ్యూరో,16 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు)**

సోమవారం వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ అధ్యక్షులు, రామకృష్ణ, సెక్రటరీ శ్రీహరి ట్రెజరర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో, మహాశివరాత్రి రుద్రాభిషేకం చాలా గొప్పగా ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షులు కడ వెండి శ్రీనివాస్ విచ్చేసి, శివరాత్రి గురించి చక్కగా వివరించారు. వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ వారు అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ ను బాగా చేస్తున్నారని, ఈ సంవత్సరం అంతర్జాతీయ అధ్యక్షులు సిద్ధా ప్రకాష్ రావు, విక్టరీ హిస్టరీ పేరుతో కోట్ల రూపాయల కార్యక్రమాల్ని, భారతదేశం మరియు 23 దేశాల్లో కార్యక్రమాలు చేపట్టారని, ఖమ్మం భద్రాద్రి జిల్లా గవర్నర్ చారు గుండ్ల శ్రీనివాస్ చక్కగా కార్యక్రమాలను, చేయిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ మోహన్ దాస్, జోన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు, ఓంకార్, సెక్రెటరీ పుల్లరావు, జిల్లా జెడ్.సి విశ్వనాథం, పొలా హరనాథ్, మరియు కోడుమూరి మోహన్ రావు, రాయపూడి ఫణి రాజ్ కుమార్, రామకృష్ణ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ చైర్మన్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, సి.ఓ చైర్మన్ గోళ్ళ రాధాకృష్ణ, ఐ.పి.సి కడవెండీ గుప్తా పాల్గొన్నారు. వల్లాల యుగేందర్ సేష్టి, సత్య సాయి బాబా సభ్యులు మరియు అధిక సంఖ్యలో మహిళలు,
పాల్గొన్నారు.

## తెలంగాణ ముచ్చట్లు కథనానికి స్పందన

- రోడ్డు మరమ్మతులు ప్రారంభం

**వేలేరు,ఫిబ్రవరి16(తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ ముచ్చట్లు ప్రచురించిన కథనానికి స్పందనగా వేలేరు మండలం పీచర గ్రామంలోని ఆమ్లెట్ గ్రామం వేములపల్లె-కొండపూర్ వెళ్లే రహదారిపై మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన మోందా తుపాన్ ప్రభావంతో వేములపల్లె సమీపంలో రహదారి దెబ్బతిని, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని మాజీ ఉపసర్పంచ్ ఎమ్మెల్యే కడియం దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే నిధుల నుండి రూ.1,65,000 మంజూరు చేయడం జరిగింది.

మంజూరైన నిధులతో గ్రామ సర్పంచ్ మరిజే అనిత-నరసింహారావు ఆధ్వర్యంలో మొరంతో గుంతలు పూడ్చే పనులు ప్రారంభమయ్యాయి. రహదారి పునరుద్ధరణతో గ్రామస్థులకు, రైతులకు రాకపోకలు సులభతరం కానున్నాయి.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వేలేరు మండల అధికార ప్రతినిధి మారబోయిన రాజు గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ గుడికందుల ప్రశాంత్, వార్డు సభ్యులు గుడికందుల రాకేష్, ఒద్దుల శ్రీకాంత్, ఉప్పల శ్రీధర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రఘునాయకుల శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏలూరి కల్యాణ్, వేములపల్లె ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తీరని యూరియా కష్టాలు

- కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆందోళన
- జిల్లా టిఆర్పి యూత్ అధ్యక్షులు రవికుమార్

**వనపర్తి,ఫిబ్రవరి16(తెలంగాణ ముచ్చట్లు):**



ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతులకు యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జి. రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మదనాపురం కేంద్రంలో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం యూరియా కొరత లేదని ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతుల అవస్థలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. నాటు వేసి నెల రోజులు దాటినా పంటలకు యూరియా అందటం లేదని ఆరోపించారు. గ్రామాల్లో నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్ లేని రైతులు సాంకేతిక సమస్యల కారణంగా యూ రి యా ను సకాలంలో పొందలేక పోతున్నారని తెలిపారు. సమయానికి ఎరువు వేయకపోతే దిగుబడి దెబ్బతింటుందని, అప్పులు చేసి పంటలు వేసిన రైతులకు ఇది మరింత భారమవుతుందని చెప్పారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మార్కెట్‌లో నకిలీ బంగారం భయం..!

- **మీ ఫోన్‌తో స్వచ్ఛతను ఇలా తనిఖీ చేయండి**

బంగారం, వెండి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మార్కెట్‌లో నకిలీ ఆభరణాల ప్రమాదం కూడా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. దేశంలో బంగారం, వెండి స్వచ్ఛతను నిర్ధారించేందుకు హాల్‌మార్కింగ్ విధానం అమల్లో ఉంది. దీనిని పర్యవేక్షిస్తుంది. హాల్‌మార్క్ అనేది ఆభరణంలో ఉన్న స్వచ్ఛమైన లోహ శాతాన్ని అధికారికంగా నిర్ధారించే ముద్ర. ఇది వినియోగదారులను మోసాల నుంచి రక్షించడమే ప్రధాన లక్ష్యం.




ప్రస్తుతం ప్రతి వెండి ఆభరణంపై సంస్థ గుర్తు, స్వచ్ఛత స్థాయి, ప్రత్యేక గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలి. బంగారం విషయంలో 14 క్యారెట్, 18 క్యారెట్, 20 క్యారెట్, 22 క్యారెట్, 23 క్యారెట్, 24 క్యారెట్ వంటి ప్రమాణాలు అమల్లో ఉన్నాయి. వెండికి కూడా వివిధ స్వచ్ఛత స్థాయిలు నిర్దేశించారు.

వినియోగదారుల సౌకర్యార్థం సంస్థ ప్రత్యేక మొబైల్ అనువర్తనం అందుబాటులోకి తెచ్చింది. ఆభరణంపై ఉన్న ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందులో నమోదు చేస్తే తయారీదారు వివరాలు, ముద్ర వేసిన కేంద్రం, తేదీ వంటి సమాచారం తెలుసుకోవచ్చు. ఇలా తనిఖీ చేయడం ద్వారా నకిలీ బంగారం, వెండి కొనుగోలు చేసే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. ధరలు అధికంగా ఉన్న ఈ సమయంలో హాల్‌మార్క్ ఉన్న ఆభరణాలనే కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు అంటూ ప్రచారం..

## కేంద్రం స్పష్టీకరణ ఇదిగో

దేశంలో యూపీఐ వినియోగం రోజు రోజుకూ భారీగా పెరుగుతోంది. చిన్న దుకాణాల నుంచి పెద్ద వ్యాపార కేంద్రాల వరకు ప్రతిచోట యూపీఐ ద్వారా చెల్లింపులు సాధారణంగా మారాయి. దీంతో నగదు వినియోగం తగ్గి, డిజిటల్ లావాదేవీలు వేగంగా పెరుగుతున్నాయి. అయితే రూ. వెయ్యికి మించిన యూపీఐ లావాదేవీలపై సేవా రుసుములు వసూలు చేయనున్నారనే వార్తలు ఇటీవల విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది.

ఈ ప్రచారంపై స్పష్టత ఇచ్చింది. వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు గానీ, వినియోగదారులు వ్యాపారులకు చేసే చెల్లింపులు గానీ ప్రస్తుతం ఎలాంటి సేవా రుసుములు విధించడం లేదని తెలిపింది. రూ.వెయ్యి దాటితే ఛార్జీలు విధిస్తారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని సూచించింది.

ప్రస్తుతం సాధారణ వినియోగదారులు రోజుకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. వ్యాపార ఖాతాలకు మరింత ఎక్కువ పరిమితి ఉంది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ మద్దతు అందిస్తోంది. చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

అధికారిక సమాచారం లేకుండా వ్యాప్తి చెందుతున్న వార్తలను నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు. యూపీఐ వ్యవస్థను మరింత సురక్షితంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉంచడమే లక్ష్యమని తెలిపారు.




# కొత్త కారు కొనాలనుకుంటున్నారా?
## అయితే ఏప్రిల్ వరకు ఆగండి!

భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అయిన (సీటా) ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉండటంతో విదేశీ కార్లు, ముఖ్యంగా బ్రిటన్‌లో తయారయ్యే వాహనాలు భారత మార్కెట్లో మరింత చౌకగా లభించే అవకాశముంది.

భారత్ మరియు యునైటెడ్ కింగ్డమ్ జూలై 24, 2025న ఈ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం 99 శాతం భారతీయ ఉత్పత్తులు సుంకం లేకుండా బ్రిటన్‌కు ఎగుమతి చేయవచ్చు. అదే సమయంలో బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే కొన్ని ఉత్పత్తులపై సుంకాలు తగ్గించబడతాయి.




ప్రస్తుతం బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్ వాహనాలపై సుమారు 110 శాతం వరకు సుంకం ఉంది. సీటా అమలులోకి వచ్చిన తరువాత ఈ సుంకాన్ని వచ్చే ఐదేళ్లలో దశలవారీగా 10 శాతానికి తగ్గించనున్నట్లు సమాచారం. దీనివల్ల లగ్జరీ కార్లు సహా పలు మోడళ్లు గణనీయంగా చౌకగా మారే అవకాశముంది. కాబట్టి కొత్త కారు కొనాలని ఆలోచిస్తున్న వారు ఏప్రిల్ వరకు వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

అంతేకాకుండా స్కాచ్ విస్కీపై ప్రస్తుతం ఉన్న 150 శాతం సుంకం మొదట 75 శాతానికి తగ్గించి, 2035 నాటికి 40 శాతానికి తీసుకువచ్చే ప్రణాళిక ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావం మద్యం మార్కెట్‌పైనా పడనుంది.

ఈ ఒప్పందం ప్రపంచంలోని ఐదవ, ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్-బ్రిటన్ మధ్య వాణిజ్యాన్ని 2030 నాటికి 56 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. వస్త్రాలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, క్రీడా వస్తువులు, బొమ్మలు వంటి అనేక ఉత్పత్తులపై సున్నా సుంకం అమలు కానుంది.

సీటా అమలుతో భారత వినియోగదారులకు విస్తృతమైన ఎంపికలు, తక్కువ ధరలు లభించే అవకాశముందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా లగ్జరీ వాహనాల కొనుగోలుదారులు కొంతకాలం ఆగితే గణనీయమైన లాభం పొందే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

# విశాఖ డెయిరీ పాల ధరలు పెంపు

విశాఖ డెయిరీ పాల విక్రయ ధరలను పెంచుతూ యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. పెరిగిన ధరలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. ఉత్పత్తి వ్యయాలు పెరగడం, పశువుల ఆహారం, రవాణా ఖర్చులు అధికమవడం వంటి కారణాలతో ధరల సవరణ తప్పనిసరి అయిందని డెయిరీ వర్గాలు తెలిపాయి.

500 మిల్లీలీటర్ల హోమోజినైజ్డ్ డబుల్ టోన్డ్ పాల ధర రూ.26 నుంచి రూ.27కు పెరిగింది. టోన్డ్ పాల ధర రూ.28 నుంచి రూ.29కు పెరిగింది. హోమోజినైజ్డ్ టోన్డ్ పాల ధర కూడా అదే విధంగా ఒక రూపాయి పెంచారు. 500 మిల్లీలీటర్ల స్టాండరైజ్డ్ పాల ధర రూ.31 నుంచి రూ.32కు చేరింది. వెయ్యి మిల్లీలీటర్ల పాల ప్యాకెట్ ధర గతంలో రూ.56 ఉండగా ప్రస్తుతం రూ.58గా నిర్ణయించారు.

ప్రతిరోజూ లక్షల లీటర్ల పాలను సరఫరా చేస్తున్న డెయిరీకి ఉత్పత్తి వ్యయాలు నిరంతరం పెరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. రైతుల నుంచి పాల కొనుగోలు ధరలు పెరగడం, ఇంధన వ్యయాలు అధికమవడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి అంశాలు ధరల పెంపుకు కారణమయ్యాయని తెలిపారు.

ఇప్పటికే పెట్రోలు, డీజిల్, కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరలు పెరగడంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో పాల ధరలు పెరగడం కుటుంబాలపై అదనపు భారం మోపుతున్నదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రైతులకు సరైన ధర అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డెయిరీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.




ధరల పెంపు నేపథ్యంలో వినియోగదారుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. పాల వినియోగం రోజువారీ అవసరమైనందున ధరల పెంపు ప్రభావం ప్రత్యక్షంగా పడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, డెయిరీ యాజమాన్యం ప్రజల భారం తగ్గించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## జియోకు అంతర్జాతీయ గుర్తింపు..
# ప్రపంచ టెక్ దిగ్గజాలతో కూటమి

భారతదేశానికి చెందిన రిలయన్స్ జియో మరో కీలక అంతర్జాతీయ విజయాన్ని సాధించింది. ప్రపంచ స్థాయిలో డేటా భద్రత, ఆధునిక సాంకేతికత అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన 'ట్రస్టెడ్ టెక్ అలయన్స్' అనే కూటమిలో జియో సభ్యత్వం పొందింది. ప్రపంచంలోని ప్రముఖ సాంకేతిక సంస్థలతో కలిసి పనిచేసే ఈ కూటమిలో భారత్ తరఫున జియో ఏకైక సంస్థగా నిలవడం విశేషంగా భావిస్తున్నారు.

జర్మనీలో జరిగిన భద్రతా సమావేశం సందర్భంగా ఈ కూటమి ఏర్పాటును ప్రకటించారు. డేటా భద్రతను బలోపేతం చేయడం, ఆధునిక సమాచార సాంకేతికతను పారదర్శకంగా అభివృద్ధి చేయడం, భవిష్యత్తు డిజిటల్ వ్యవస్థలకు నమ్మకమైన నియమాలు రూపొందించడం ఈ కూటమి




ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, ఐదవ తరం మొబైల్ సేవలు, మేఘ సాంకేతిక వ్యవస్థల అభివృద్ధికి సురక్షిత మార్గదర్శకాలను రూపొందించడంపై దృష్టి సారించనున్నారు.

ఈ కూటమిలో ప్రపంచంలోని పలు ఖండాలకు చెందిన ప్రముఖ సంస్థలు భాగస్వాములయ్యాయి. వాటిలో గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ తదితర సంస్థలు ఉన్నాయి. కనెక్టివిటీ, మేఘ వేదికలు, సాఫ్ట్‌వేర్, సాంకేతిక మౌలిక వసతుల అభివృద్ధిలో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఈ సంస్థలు నిర్ణయించాయి.

ప్రపంచవ్యాప్తంగా డేటా దొంగతనం, సైబర్ ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో సురక్షిత సాంకేతిక వ్యవస్థల అవసరం పెరిగిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కూటమి ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విశ్వసనీయ సాంకేతిక ప్రమాణాలు ఏర్పడే అవకాశముందని భావిస్తున్నారు.

జియో ఈ కూటమిలో చేరడం ద్వారా భారత డిజిటల్ రంగానికి మరింత గుర్తింపు లభించిందని విశ్లేషకులు చెబుతున్నారు. భవిష్యత్తులో కొత్త సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, ప్రపంచ సంస్థలతో భాగస్వామ్యం, దేశీయ డిజిటల్ వ్యవస్థ బలోపేతానికి ఇది దోహదపడనుందని అంచనా వేస్తున్నారు.

# ఉద్యోగులకు, సామాన్యులకు ఊరట!

2026 సంవత్సరానికి సంబంధించిన కొత్త ఆదాయపు పన్ను చట్టం ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ప్రతిపాదనలపై ఫిబ్రవరి 22 వరకు ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు గణనీయమైన పన్ను ఉపశమనం లభించే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ముసాయిదాలో ఉద్యోగులకు లభించే వేతనేతర ప్రయోజనాల పరిమితులను పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి. వాహనాల సామర్థ్యాన్ని ఆధారంగా చేసుకుని మినహాయింపులు కల్పించడం, భోజన భత్యం, బహుమతి కూపన్లు, వడ్డీ లేని రుణాలు, విద్యా భత్యం, వసతి గృహ భత్యం వంటి అంశాల్లో సడలింపులు ఇవ్వాలని సూచించారు. ఇవి ఉద్యోగులపై పడే పన్ను




భారాన్ని తగ్గించే అవకాశముంది.

అదేవిధంగా బ్యాంకుల్లో నగదు ఉపసంహరణలు, నగదు జమలపై గుర్తింపు సంఖ్య అవసరమైన పరిమితులను పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి. స్థిరాస్తి కొనుగోలు-అమ్మకాలు, ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు, హోటల్ బిల్లుల విషయంలో కూడా కొన్ని సడలింపులు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇంటి అద్దె భత్యం విషయంలో కూడా కీలక మార్పులు సూచించారు.

ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఇంటి అద్దె భత్యం మినహాయింపును 40 శాతం నుంచి 50 శాతానికి పెంచే ఆలోచన ఉన్నట్లు సమాచారం. ఈ పన్ను చట్టం అమలులోకి వస్తే ఉద్యోగులు, సామాన్య ప్రజలకు పన్ను భారం తగ్గి ఆర్థికంగా ఊరట లభిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# భారీ లాభాలతో ముగిసిన షేర్ మార్కెట్లు

ఈ రోజు స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ షేర్ మార్కెట్లు రోజు మొత్తం కొనుగోళ్ల ఉత్సాహంతో ముందుకు సాగాయి. మధ్యాహ్నం తర్వాత పెట్టుబడిదారుల కొనుగోళ్లు మరింత పెరగడంతో సూచీలు వేగంగా పైకి ఎగిశాయి. సాయంత్రం వరకూ కొనసాగిన సానుకూల ధోరణితో మార్కెట్లు గట్టి లాభాలతో ముగిశాయి. పరిశ్రమలు, బ్యాంకింగ్, సమాచార సాంకేతిక రంగాల షేర్లలో కొనుగోళ్లు ఎక్కువగా నమోదయ్యాయి.

ప్రధాన సూచీల్లో బీఎస్ఈ సెన్సెక్స్ 650.39 పాయింట్లు పెరిగి 83,277.15 వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ 50 211.65 పాయింట్లు లాభపడి 25,682.75 వద్ద స్థిరపడింది. భారీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు పెరగడం సూచీల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా ఉండటం కూడా మార్కెట్‌కు మద్దతు ఇచ్చింది.



లాభాలు నమోదు చేసిన షేర్లలో భారత్ సీట్స్ లిమిటెడ్, ఆర్.ఎ.సి.ఎల్ గేర్‌టెక్ లిమిటెడ్, ఈజీ ట్రిప్ ప్లానర్స్ లిమిటెడ్ ముందంజలో నిలిచాయి. మరోవైపు బీటా డ్రగ్స్ లిమిటెడ్, సార్థక్ మెటల్స్ లిమిటెడ్ షేర్లు నష్టాలను చవిచూశాయి. కొన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించినప్పటికీ మొత్తం మార్కెట్ ధోరణి మాత్రం సానుకూలంగానే కొనసాగింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఘనంగా వట్పల్లిలో ఖ్వాజా షరీఫ్ ఉర్సు ఉత్సవం

- ఆధ్యాత్మిక కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొనడం
- భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి





**సంగారెడ్డి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దర్గా ఎ హజ్రత్ సయ్యద్ షా ఖ్వాజా దాస్ ఖాజా షరీఫ్ గారి 40వ వార్షిక ఆరాధన మహోత్సవం ఉర్సు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వట్పల్లిలోని ఖ్వాజా షరీఫ్ దర్గా ను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు చద్దర్ సమర్పించి ఆశీర్వాదాలు పొందారు. ఉర్సు ఉత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం సామూహిక భోజనశాలలో నేలపై కూర్చుని భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మంత్రి నిరాడంబరంగా భక్తులతో మమేకమై భోజనం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

# ఏడు కార్పొరేషన్లలో మేయర్ ఎన్నికలు పూర్తి

- ఐదు చోట్ల కాంగ్రెస్ ఆధిక్యం
- కరీంనగర్‌లో బీజేపీ విజయం




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. మొత్తం ఏడు కార్పొరేషన్లలో ఐదు చోట్ల కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవిని బీజేపీ కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ సమాన స్థానాలు గెలవడంతో రెండు పార్టీలు అవగాహనకు వచ్చాయి. కరీంనగర్ మేయర్ పదవి కోసం మొదటి నుంచి ఉత్కంఠ నెలకొనగా చివరికి బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. నిజామాబాద్‌లో మజ్లిస్ పార్టీ మద్దతుతో కాంగ్రెస్ మేయర్ పదవిని దక్కించుకుంది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాలు గెలవడంతో రొటేషన్ పద్ధతిలో అధికారాన్ని పంచుకోవాలని నిర్ణయించాయి. మొదటి రెండున్నరేళ్లు మేయర్ పదవి సీపీఐకి, డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. ఇక్కడ బీఆర్ఎస్ ఎనిమిది స్థానాలు గెలిచింది. సీపీఐకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బేషరతుగా మద్దతు ప్రకటించినప్పటికీ, సీపీఐ మాత్రం కాంగ్రెస్‌తో కలసి ముందుకు సాగింది.

కార్పొరేషన్ల వారీగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్లు ఇలా ఉన్నారు. కరీంనగర్‌లో మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా సునీల్ రావు ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లో మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎంపికయ్యారు. రామగుండంలో మేయర్‌గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్‌గా పాతిపెల్లి ఎల్లయ్య ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో మేయర్‌గా మూడ్ గణేశ్, డిప్యూటీ మేయర్‌గా సిరిపురపు లలిత కుమారి బాధ్యతలు చేపట్టారు. నల్గొండలో మేయర్‌గా బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్‌గా మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్‌లో మేయర్‌గా గుమల్ మమత, డిప్యూటీ మేయర్‌గా సురేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాలలో మేయర్‌గా మధుకర్, డిప్యూటీ మేయర్‌గా రమ్య మహేశ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీయనున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మంత్రి పదవిపై కోమటిరెడ్డి వ్యాఖ్యలు

- పదవులు శాశ్వతం కావని స్పష్టం
- మునుగోడు అభివృద్ధే తన లక్ష్యమని వెల్లడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు శాశ్వతం కాదని, తన నియోజకవర్గ అభివృద్ధే తనకు ముఖ్యమని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోయినా పరవాలేదని, మునుగోడు అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తే చాలని అన్నారు. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. తనకు మంత్రి పదవి ఇవ్వాలనే హామీతోనే తాను పార్టీలోకి వచ్చానని, మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని గతంలో వెల్లడించారు. లేకపోతే ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తానని కూడా వ్యాఖ్యానించారు. మళ్లీ అడగబోనని, కానీ తనకూ ఒకరోజు వస్తుందని, ఆ రోజు పదవి లాక్కుంటానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఒక్క ముఖ్యమంత్రి మాత్రమే కష్టపడలేదని, పార్టీలోని ప్రతి నాయకుడు శ్రమించారని ఆయన అభిప్రాయపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తాజాగా చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

# జనగామ చైర్మన్ ఎన్నికలో ఉద్రిక్తత

- కౌన్సిలర్ కిడ్నాప్ ఆరోపణలతో హైడ్రామా
- కోరం పూర్తి కావడంతో ఎన్నిక కొనసాగింపు

**జనగామ, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 28వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ హఫీజ్ ఫాతిమాను మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా చోటుచేసుకుంది. ఆమె కిడ్నాప్ అయ్యిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఫాతిమాను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు పోలీసులు యత్నించగా జనగామ ఎమ్మెల్యే పల్లా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీతో వాగ్వాదం జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని హఫీజ్ ఫాతిమా స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెలిచానని, అదే పార్టీకే మద్దతు ఇస్తానని తెలిపారు. అనంతరం ఆమె మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లారు.

ఇదిలా ఉండగా, ఎన్నికను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. అయితే కోరం సభ్యులంతా హాజరైనందున ఎన్నిక వాయిదా వేయలేమని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కొనసాగుతుందని ప్రొసీడింగ్ అధికారులు తెలిపారు.



## ఎవడు వాడు?

ఎవరో వున్నారు నాలో
నాకే తెలీకుండా
మిత్రుడో శత్రువో
ఏమో
అర్థం కాదసలు.

బాధలో వున్నప్పుడు
నన్ను ఓదారుస్తాడు
అమ్మల్లే అక్కున చేర్చుకొని బుజ్జగిస్తాడు
నీరసపడిపోతున్నప్పుడు
ధైర్యాన్ని నూరిపోస్తాడు
శ్వాస ఆడక అల్లాడిపోయినప్పుడల్లా
ఊపిరి పోసి నన్ను బతికిస్తాడు.

మరోవైపు
మూసిన నా యద తలుపుల్ని తెరిచేందుకు
సుత్తులతో కొడుతుంటాడు
వద్దనుకొని వదిలేసిన
చేదు జ్ఞాపకాలని తెచ్చి
నా దోసిలి నింపుతాడు.
అందని ఆశల వైపు
దారంతో కట్టిన ఓ నిచ్చెనమెట్లు ఎక్కమంటాడు.
గమ్యంకాని దిక్కున
నన్ను లాకెళ్ళి పరిగెత్తిస్తాడు.

అసలెవరితను..?
నా అనుమతి లేకుండా నాలోకి ఎలా వచ్చాడు.?
ఇంతకీ
వాడు ఒక్కడేనా
లేక ఒకరితో ఒకరు పొట్లాడుకుంటూ
నాలో ఇద్దరున్నారా??

ఏమో తెలీదు
కానీ
నాలో ఎవరో వున్నారు
నాకే తెలీకుండా
మిత్రుడో శత్రువో
ఏమో
అసలేమీ అర్థం కాకుండా!!

- దియా విఘ్నేష్



## వనపర్తి మున్సిపాలిటీలో కలకలం

కాంగ్రెస్‌కు కౌన్సిలర్ రాజీనామా
చైర్మన్ పదవి విషయంలో మోసం చేశారన్న ఆరోపణ

**వనపర్తి, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి మున్సిపాలిటీలో రాజకీయ కలకలం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్ చీర్ల రజిని చందర్ రాజీనామా చేశారు. చైర్మన్ పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆమె ఆరోపించారు. టికెట్ ఇచ్చిన సమయంలోనే చైర్మన్ అవకాశం ఇస్తేనే పోటీ చేస్తామని స్పష్టం చేశామని, కానీ ఎన్నికల తర్వాత ఆ హామీ నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి తనను అమ్ముకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మూడు తరాలుగా తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి పనిచేసిందని, తమ నమ్మకాన్ని పార్టీ వమ్ము చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే పార్టీ సభ్యత్వంతో పాటు పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచిన రజిని చందర్ రాజీనామా చేయడంతో స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ నాయకత్వం ఈ పరిణామంపై ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

# రాష్ట్ర పోలీస్ క్రీడల్లో సత్తా చాటాలి





## వరంగల్ కమిషనరేట్ క్రీడా పతకం ఆవిష్కరణ
## క్రీడాకారులకు ప్రోత్సాహక సామగ్రి పంపిణీ

**వరంగల్, ఫిబ్రవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీసులు సత్తా చాటాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. రేపటి నుంచి సైబరాబాద్ కమిషనరేట్‌లో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీలకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాన్ని పోలీస్ అధికారులు, క్రీడాకారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనే పోలీస్ క్రీడాకారులకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాక్ సూట్లు, క్రీడా షూస్, టీ షర్టు పంపిణీ చేశారు. సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ఈ సామగ్రి అందజేశారు., ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా క్రీడల్లోనూ ప్రతిభ కనబరచగలరని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ఫలితాలు సాధించి వరంగల్ కమిషనరేట్‌కు పేరు తీసుకురావాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, ఆర్ఐ సతీష్, ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్, క్యాంపు క్లర్క్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in